# జాకిర్ హుసేన్

1962.

అప్పుడు డాక్టర్ జాకిర్ హుస్సేన్ ఉపరాష్ట్రపతిగా వున్నారు ఢిల్లీపాలక వ్యవస్థ వారాయనను ఇక్కడి బుద్ధజయంతి పార్కులో వన మహోత్సవాన్ని ప్రారంభించమని కోరారు. అయితే ఆయన ఒకషరతుమీద అందుకు ఒప్పుకున్నారు. తాను అక్కడ ప్రసంగం చెయ్యను అన్నది ఆ షరతు. కాని తీరా అక్కడ పార్కులో ఆ డెవలప్‌మెంట్ కమీషనరు - "కొన్నిమాటలు సెలవియ్యవలసిందిగా" హుస్సేన్‌గారిని కోరాడు. ఆయన అయిష్టంతో లేచి - "చెట్టు గొప్పతనం ఏమిటంటే అది అందరికీ చల్లని నీడ నిస్తుంది కాని మాట్లాడదు." అని కూర్చున్నారు !

జాకిర్ హుస్సేన్‌గారికి మాటాడడంకన్న వినడమే ఎక్కువ ఇష్టంగా వుండేది. ప్రసంగాలు చేయడమంటే ఆయనకు చిరాకు పుట్టేది.

ఒకసారి ఒక విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ ఆయన - వినడం అన్నది మాటాడడం కన్న నాగరికమైన ప్రవర్తన. అని చెప్పారు.

"కాని విధి నాపట్ల చిన్నచూపు చూచింది. ప్రసంగాలు చెయ్యడం అన్నది తప్పనిసరి అవుతున్నది. కాని నా మనసును నేను-"నా జీవితంలో నేను ప్రసంగాలతో ఇతరులను బాధించినదానికన్న, నేను వినినదే ఎక్కువ. అని సమాధాన పరచుకుంటుంటాను " అన్నారాయన.

తన జీవితమంతా విద్యాసేవకు అంకితంచేసిన సౌమ్యమూర్తి డాక్టర్ జాకిర్‌హుసేన్‌కు పువ్వులన్నా, మొక్కలన్నా, స్ఫటికాలన్నా పుస్తకాలు

చదవడమన్నా ఎంతో ఇష్టం స్ఫటికాలన్నా 'ఫాసిల్స్' అన్నా ఆయన కున్న మోజును గమనించి, సోవియెట్ ప్రభుత్వం డాక్టర్ హుసేన్ రష్యా పర్యటించినపుడు ఆయనతోబాటు తన భూగర్భశాఖామంత్రిని పంపింది. ఆయన దృష్టి నాకర్షించిన రకరకాల స్ఫటికాలను ఆయనను సోవియెట్ ప్రభుత్వం బహూకరించింది. కీర్తిశేషులు అణ్ణాదురై డాక్టర్ హుసేన్‌కు అపూర్వమైన శిలలతో నిర్మించిన చెట్టును బహూకరించారు. డాక్టర్ హుసేన్ మే 1967లో రాష్ట్రపతి భవనంలో ప్రవేశించినప్పుడు తనతో బాటు 1500 అపురూపమైన ఫాసిల్స్‌ను, స్ఫటికాలను, శిలలను, చిత్రాలను, పర్షియన్ హస్తలిఖిత ప్రతులను. పుస్తకాలను తీసుకొచ్చుకొన్నారు.

ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రపతి భవన్ వెనుకనున్న మొఘల్ గార్డెన్స ఎన్నో క్రొత్త శోభలను సంతరించుకుంది ఆల్జీరియా మెక్సికో వంటి దూర దేశాలనుండి 72 కేక్టస్ రకాలను ఆయన తెప్పించారు. గులాబీలన్నా ఆయ నకు ప్రాణం. ఆయన కొన్ని క్రొత్తగులాబీ రకాలకు స్వయంగా నామ కరణంచేశారు.

పుస్తకాలు చదవడమూ, వ్రాయడముకూడా ఆయన సరదాలు. ఆయన "చిల్‌డ్రన్స్ బుక్ ట్రస్ట్"కు అధ్యక్షులుగా వున్నారు. ఆయిదేళ్ళ వయస్సున చనిపోయిన తన ముద్దుల కుమార్తె రుకయ్యారెహనా పేరుతో డాక్టర్ హుసేన్ వ్రాసిన కథలు "అబ్బూఖాన్ మేక మరియు పధ్నాలుగు కథలు" అన్న పుస్తకంగా ప్రచురింపబడింది. కుందేలు–తాబేలు కథను ఇప్పటి పరిస్థితుల కనుగుణంగా మార్చి వ్రాసిన కథ ఆయన రచనలలో ఆఖరిది.

* * *

మేమూడవ తారీఖున ఆయన కన్నుమూసినరోజు ఆయన మేజామీద ఎస్.ఎస్. ఖేరా రచించిన "ఇండియాస్ డిఫెన్స్ ప్రాబ్లెమ్స్" అన్న పుస్తకం వుంది. ఆపుస్తకం మధ్య వున్న గుర్తునుబట్టి, ఆనాడాయన దానినింకా

చదువుతున్నారని తెలుస్తూంది. ఆ ప్రక్కనే మేజా మీద అజంతా, ఎల్లోరా శిల్పాల గురించిన పుస్తకాలు, చరిత్ర గ్రంథాలు, ఆ ప్రొద్దుటి దినపత్రికలు, టేపురికార్డరూ: ట్రాన్సిస్టరూ, రేడియో వున్నాయి. ఎదుట గోడ మీద "కొరాను" లోని సూక్తులు "ఫ్రేము" లలో వేలాడుతున్నాయి.

ఆ శనివారం ప్రొద్దున ఆయనకు ఒంట్లోసరిగా లేదేమో ... అసలంతకు ముందు వారం నుండీ డాక్టర్ హుసేన్ ఎప్పటివలె ప్రొద్దున్నే ఆరింటికి మొఘల్ గార్డెన్‌లో పచారుచేయడానికి వెళ్ళడంలేదు. శుక్రవారం రాత్రి ఆకలిగా లేదని భోజనం మానివేశారు. ఆరాత్రి ఎప్పటికన్నా ఎక్కువసేపు, అర్థరాత్రిదాక చదివారు. శనివారం పొద్దున కాస్త ఆలస్యంగా లేచారు, ఆయన వరండాలో పచారుచేస్తూ తన భార్యను పలకరించడానికి వెళ్ళారు. అప్పుడామె వెన్న చిలుకుతున్నారు. తనకు అప్పుడు ఉపాహారం ఏమీ వద్దన్నారు డాక్టరు హుసేన్, కాని ఆమె బలవంతాన ఒక గ్లాసెడు మజ్జిగ తీసుకున్నారు. రోజులా ఆనాడాయన స్నానం చేయలేదు. కాళ్ళు, చేతులు, ముఖమూ, కడుకున్నారు.

శనివారం ఉదయం 11.20కు ఆయనకన్ను మూశారు. పన్నెండింటికల్లా ఢిల్లీ నగరమంతా అట్టుడికిపోయింది. జనులు గుసగుసలాడు కున్నారు, కాని మధ్యాహ్నం 1.20కి కాని ఆకాశవాణి ఆ వార్తను ప్రసారం చేయలేదు రాష్ట్రపతి మరణించిన తర్వాత రెండు గంటలసేపు రాజధానీనగరంలో పార్లమెంటు భవనంమీద, ఇతర ప్రభుత్వ భవనాలమీద జాతీయ పతాకం మామూలుగానే, ఎత్తుగానే ఎగిరింది :

జవహర్‌లాల్ నెహ్రూ (1964) "మే" నెలలో పగటివేళ మరణించారు. జాకిర్ హుసేన్ కూడా "మే" నెలలో పగటివేళ మరణించారు ఇద్దరి మరణ వార్తలూ రాజధానీ నగరవాసులకు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తెలిశాయి.

నెహ్రూ మరణించిన మరురోజు (28మే 1964) ఉదయం 11-44 గంటలకు, ఆ మరురోజు 7-30 గంటలకు మొత్తం రెండుసార్లు ఢిల్లీలో భూమి కంపించింది. జాకిర్‌హుసేన్ శనివారం (3 మే 1969) మరణించారు. ఆది వారం ఉదయం 10 గంటలకు, సోమవారం తెల్లవారు ఝామున 2-30 గంట లకు మొత్తం రెండుసార్లు ఢిల్లీలో భూమి కంపించింది.

డాక్టర్ హుసేన్, తాను 45 ఏళ్ళు జీవించి, శ్రమించి, పోషించి, పెం చిన ఇక్కడి "జమియా మిలియా" విశ్వవిద్యాలయం ఆవరణలో. తాను మరణించాక తన దేహాన్ని ఖననం చేసే నిమిత్తం కొంతచోటును కేటాయించ వలసిందిగా తన మిత్రుడు, ప్రస్తుతం "జమియా మిలియా'' ఉపాధ్యక్షుడూ అయిన శ్రీ ముజీబ్‌ని రెండు నెలలు క్రింద కోరారట! డాక్టర్ హుస్సేన్‌కు తన మరణంగురించి ముందే ఊహకల్గిందా? ఏమో .... కల్గిఉండవచ్చు!

వెంటనే ముజీబ్ ఆ ఆవరణలో ఒక నాలుగెకరాల చోటును ఎన్నిక చేశారు. ఆ ఎన్నికలో ఆయనకు తోడ్పడిన ''జమియా మిలియా'' రిజిస్ట్రార్ షోయెబుర్ రెహ్మాన్- ''ఇదెవ్వరి నిమిత్తం?'' అని అడిగితే ముజీబ్ ఎవరికీ అవి చెప్పకుండా "నన్నడక్కండి: ఇదొక ముఖ్యమైన వ్యక్తికి!" అన్నా రట,

తీరా డాక్టర్ జాకిర్ హుసేను మరణించిన రోజు ముజీబ్ నేపాల్ లో వున్నారు: షోయెబుర్ రెహ్మాన్‌ను రాష్ట్రపతి భవన్‌కు పిలిపించి డాక్టర్ హుసేన్ దేహాన్ని ఖననం చెయ్యడానికి ''జమియా'' ఆవరణలో చోటుకావా లని చెప్పగానె ఆయనకు రెండునెలలక్రిందటి సంఘటన గుర్తుకువచ్చింది. వెంటనే ఆ చోటునే ఆయన చూపించగలిగారు. ఆతర్వాత ముజీబ్ నేపాల్ నుండి వచ్చారు. జమియామిలియా ఆవరణలో తనభర్త ప్రక్కగా తన దేహాన్ని పాతిపెట్టవలసినదిగా డాక్టర్ హుసేన్ భార్య షాజహాన్ బేగం కోరారు.

ఇంతకు ముందు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ప్రస్తుతం పార్లమెంటు సభ్యులూ సుప్రసిద్ధ ఉర్దూకవి అయిన శ్రీ ఆనంద్ నారాయణ్ ముల్లాడాక్టర్ హుసేన్‌కు తనశ్రద్ధాంజలి నర్పిస్తూ లోకసభలో ఈక్రింద కవితను చదివారు.

"ముందు వరుసనుండి ఒక్కరే తొలగిపోయారు
అయినాసాకీ, ఆ వరుస ఎంత బోసిగా వున్నది ?
చావు చేతులారిపిన దీపమొక్కటే,
కానీ సాకీ జాతి గమ్యమంతా చీకటిమయ మయింది.
ఒక్క మొగ్గ విచ్చింది; కొద్దిసేపే పరిమళాలనిచ్చింది.
తాను రాలింది ; తనవెనుక ముళ్ళను మిగిల్చింది,
పూవుతోబాటు తావిని చెయ్యకండి ఖననం
మనందరికీ మిగిలిందొక్కటే, అదేఆపరిమళం".

★